క్లుప్తంగా

నిల్వ ఆహారాన్ని తీసుకోకూడదు

అంబాజీపేట: ఇంటిలో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను 0–5 ఏళ్ల చిన్నారులతో పాటు పెద్దలు తినరాదని అంబాజీపేట పీహెచ్‌సీ సీహెచ్‌వో బి.అప్పారావు, పంచాయతీ కార్యదర్శి సత్యవేణి అన్నారు. గంగలకుర్రులో స్టాప్ డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలని, కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచించారు. నీళ్ల విరేచనాల లక్షణాలు ఉంటే దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రాలను సంప్రదించాలన్నారు. అక్కడ అందించే ఓఆర్ఎస్, జింక్ మాత్రల ద్వారా విరేచనాలను నివారించవచ్చన్నారు. అనంతరం ఓఆర్ఎస్, జింక్ మాత్రలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్‌లు జీవీవీకే ప్రసాద్, ఎం.అర్జమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ నిషి, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు సంపూర్ణంగా టీకాలు

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు.

మోటారు సైకిలిస్టు మృతి


మణికంఠ

అంబాజీపేట: మాచవరం శివారు భారత్ గ్యాస్ కంపెనీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిలిస్టు మృతి చెందాడు. అమలాపురం రూరల్ గున్నేపల్లి అగ్రహారానికి చెందిన మట్టా మణికంఠ (31) తన మోటారు సైకిల్‌పై పి.గన్నవరం నుంచి అంబాజీపేట వైపు వస్తున్నాడు. ఈ సమయంలో గ్యాస్ కంపెనీ వద్ద రోడ్డులోని భారీ గోతిలో పడి మోటారు సైకిల్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో మణికంఠ మృతి చెందాడు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


ప్రేమ్‌కుమార్ (ఫైల్)

అయినవిల్లి: వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన అడపా ప్రేమ్‌కుమార్ (29) మంగళవారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తన ఇంట్లో కరెంటు లేక పోవడంతో తన అన్నయ్య ఇంటి నుంచి సరఫరాను తీసుకునేందుకు ఫ్యూజు మారుస్తుండగా విద్యుత్ తీగలు అతడి నోటికి తగిలాయి. దీంతో షాక్‌కు గురైన అతడిని 108లో అమలాపురం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ప్రేమ్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.రాజేష్ కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం

రావులపాలెం: బొబ్బర్లంక– ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్‌లో స్థానిక సిద్దార్థ స్కూల్ సమీపంలో ఒక గుర్తుతెలియని మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి మృతదేహంగా పోలీసులు గుర్తించారు. ప్రధాన పంట కాలువలో వెదురు బొంగులకు చిక్కుకొని ఉండటంతో స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుని వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌గా సాత్విక్

అమలాపురం టౌన్: రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌లో అమలాపురానికి చెందిన ద్రాక్షారపు సాత్విక్ ప్రతిభ చాటి చాంపియన్‌గా నిలిచాడు. రాజమహేంద్రవరం కాల్ ఫ్యూజస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో ద్రాక్షారపు సాత్విక్ ఏడు రౌండ్లలో విజేతగా నిలిచినందుకు రూ.2,500 నగదు బహుమతిని కైవసం చేసుకున్నాడు. అలాగే అండర్–15 కేటగిరీలో కేశనకుర్తి రాజేష్ ప్రథమ స్థానంలో నిలిచి రూ.2,500 నగదు బహుమతి సాధించాడు. వీరితో పాటు విద్యార్థి బండారు నానిబాబు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.1000 నగదు బహుమతిని పొందాడు.

మందకొడిగా తాగునీటి ప్రాజెక్టు పనులు

- 2021 సెప్టెంబర్‌లో ముగిసిన గడువు
- గెయిల్ నిధులు రూ.ఆరు కోట్లతో నిర్మాణం

మామిడికుదురు: నగరం గ్రామంలో గెయిల్ నిధులు రూ.ఆరు కోట్లతో చేపట్టిన ఇంటింటికీ తాగునీటి పథకం పనులు మందకొడిగా జరుగుతున్నాయి. ఎక్కడి పనులు అక్కడే అన్న చందంగా ఈ ప్రాజెక్టు పరిస్థితి తయారైంది. 2020 సెప్టెంబరు నెలలో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎంతో ఆట్టహాసంగా శంకుస్థాపన చేశారు. 2021 సెప్టెంబరు నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ గడువు ముగిసి చాలా కాలమైనా ఈ ప్రాజెక్టు నిర్మాణం ఇంత వరకు పూర్తి కాలేదు. దీనిపై స్థానికుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. దీనిపై గెయిల్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తక్షణం స్పందించి ఈ ప్రాజెక్టు నిర్మాణం త్వరితంగా పూర్తయ్యే విధంగా కార్యాచరణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

1900 గృహాలకు సరఫరా..

నగరం గ్రామ జనాభా 2011 లెక్కల ప్రకారం 6,050 మంది. గ్రామంలో 1,900 గృహాలు ఉన్నాయి. ఇంటింటికీ తాగునీరు అందించేందుకు గ్రామంలో మొత్తం అయిదు స్టోరేజ్ ట్యాంకులు నిర్మించారు. 3.60 లక్షల లీటర్ల కెపాసిటీతో వీటిని ఏర్పాటు చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రెండు లక్షల లీటర్ల కెపాసిటీతో ప్రస్తుతం మెయిన్ ట్యాంకు అందుబాటులో ఉంది. దీనికి అదనంగా మరో నాలుగు ట్యాంకులు నిర్మించారు. ఒక్కో ట్యాంకును 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. నగరంలో 57,180 క్యూబిక్ మీటర్లు కెపాసిటీతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ఒక సంపు, మైక్రోఫిల్టర్, రెండు ఇన్‌టెక్ వెల్స్ నిర్మించారు. 2.80 కిలోమీటర్లు పంపింగ్ మెయిన్‌తో పాటు 15 కిలో మీటర్లు డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్, ఆరు కిలోమీటర్ల మేర గ్రావిటీ మెయిన్ పైప్ లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పనుల్లో స్తబ్దత నెలకొంది.


నగరంలో చివరి దశకు చేరిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణ పనులు

చర్యలు తీసుకుంటున్నాం

గెయిల్ నిధులతో చేపట్టిన ఇంటింటికీ కుళాయి ప్రాజెక్టు నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నాం. ప్రస్తుతం 90 శాతం పైబడి పనులు పూర్తి చేశాం. మొదట్లో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవరోధాలు ఏర్పడ్డాయి. అందుకే గడువు లోగా పనుల్ని పూర్తి చేయలేకపోయాం. ప్రాజెక్టు నిర్మాణం పనులు చివరి దశకు చేరాయి. త్వరలోనే ఈ ప్రాజెక్టును ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

– జయశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ

శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాలి

అంబాజీపేట: సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఉన్న వాటర్ ట్యాంకుల ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాలని డీఎల్పీవో పి.బొజ్జిరాజు అన్నారు. ఇరుసుమండ, ముక్కామల, పుల్లేటికుర్రు తదితర గ్రామాల్లో బుధవారం ఆయన వాటర్ ట్యాంకులను పరిశీలించారు. డీఎల్పీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగానే గ్రామాల్లో ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం జరిగిందన్నారు. ప్రతి 15 రోజులకోసారి మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని ఆయా పంచాయతీలకు సూచించామన్నారు. మంచినీటిని సరఫరా చేయడంలో ఎవరూ అలసత్వం వహించవద్దని హెచ్చరించామన్నారు. డీఎల్పీవో వెంట కార్యదర్శి రాయి ఏడుకొండలు చంటి తదితరులు పాల్గొన్నారు.


ఇరుసుమండలో మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న డీఎల్పీవో బొజ్జిరాజు

మెకానిక్‌ల సమస్యలు పరిష్కరిస్తాం

పి.గన్నవరం: మోటార్ మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారికి బ్యాంకు ద్వారా రుణాలు పొందే సదుపాయం కల్పిస్తామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. వరల్డ్ టూ వీలర్ మెకానిక్స్ డే సందర్భంగా పి.గన్నవరం మండలం పోతవరంలో శ్రీసూర్యచంద్ర మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పి.గన్నవరం మూడు రోడ్ల కూడలి నుంచి పోతవరం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పోతవరంలో జరిగిన సభలో ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ గాట్లీబ్ డైమ్లర్ అనే మహనీయుడు ద్విచక్ర వాహనాన్ని సృష్టించి నేడు ఎంతో మందికి ఉపాధి కల్పించారన్నారు. ఎమ్మెల్యేను యూనియన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పి.గన్నవరం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

గోపాలరాజు సేవలు ఆదర్శం

కొత్తపేట: ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)గా, గెజిటెడ్ హెచ్ఎంగా అల్లూరి గోపాలరాజు సేవలు ఉపాధ్యాయులకు ఆదర్శనీయమని అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్ఎంగా పనిచేసి గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన అల్లూరి గోపాలరాజు వీడ్కోలు సన్మానం బుధవారం మధ్యాహ్నం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం ఆర్.రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ హెచ్ఎం గోపాలరాజు పీడీగా, గెజిటెడ్ హెచ్ఎంగా జిల్లాలోని వివిధ ప్రాంతల్లో పని చేశారన్నారు. ప్రతి చోట ఎంతో నిబద్ధతతో, ఉన్నత లక్ష్యాలతో పని చేసి ఆయా పాఠశాలలను ఉత్తమ ఫలితాలతో ఉన్నత స్థాయిలో నిలిపారన్నారు. పలువురు రాష్ట్ర, జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ గోపాలరాజు సేవలను కొనియాడారు. అనంతరం ఆయనను పూల కిరీటం, గజమాలలు, శాలువాలు, నూతన వస్త్రాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.


కొత్తపేటలో హెచ్ఎం గోపాలరాజు దంపతులను సత్కరిస్తున్న డేవిడ్, గంగాధరరావు

కృష్ణమాదిగ పోరాటంతో పింఛన్ల రెట్టింపు

మామిడికుదురు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పోరాటం ఫలితంగానే దివ్యాంగుల పెన్షన్లు రెట్టింపు చేశారని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ పేర్కొన్నారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో బుధవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి, మదర్ థెరిసా దివ్యాంగుల సంక్షేమ సంఘం సంయుక్త సమావేశం జరిగింది. మండల సంఘం అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేలు నుంచి రూ.6 వేలకు పెంచినందుకు పీఎం నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు సమావేశం కృతజ్ఞతలు తెలిపింది.


మామిడికుదురులో కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పెద్దింటి వేంకట శ్రీనివాస్, వేద పండితులు ఈ కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్ దర్శనం కల్పించింది. అలాగే లడ్డూ ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పించింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


అంతర్వేదిలో నిర్వహిస్తున్న స్వామి కల్యాణం

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మలికిపురం: ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లడమే రాజోలు నియోజకవర్గ చైతన్య సమితి లక్ష్యం అని కార్యవర్గ సభ్యులు ప్రకటించారు. బుధవారం మలికిపురంలోని భూపతి వారి పేటలో జరిగిన చైతన్య సమితి కార్యవర్గ సమావేశం సమితి అధ్యక్షులు నల్లి ప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా సామాజిక కార్యకర్త, యెనుమల వెంకటపతిరాజా హాజరై మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. నియోజకవర్గ సమస్యలను శాసనసభ్యుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం వైపు చైతన్య సమితి కృషి చేయాలని ఆయన కోరారు. మంచినీటి సమస్యపై ఎమ్మెల్యే ఇప్పటికే సంబంధిత అధికారులతో చర్చలు జరిపారని త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన అన్నారు. రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, తీర ప్రాంత గ్రామాల్లో ఇసుక తవ్వకాలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు చేపట్టాలని, అక్రమ ఆక్వా సాగును అరికట్టాలని, తీర ప్రాంతంలో ఏవీఆర్ ఆయిల్ కంపెనీ పనులను నిలుపుదల చేయాలని సమావేశం తీర్మానించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మంద సత్యనారాయణ, చింతా సత్య, ముత్యాల శ్రీనివాసరావు, చెవ్వాకుల వెంకట్, బూసి జాన్ మోషే, గడ్డం బాలరాజు, పోతుల శేఖర్‌నాథ్, బడుగు సాయిబాబా, జనపల్లి నాని, పోలుకొండ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త యెనుముల వెంకటపతిరాజు

ఘనంగా రావులమ్మ తీర్థం

అంబాజీపేట: వాకలగరువులో వేంచేసిన గ్రామ దేవత రావులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ఆడపడుచులు, భక్తులు అమ్మవారికి చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం రాత్రి అమ్మవారి పూజ ఘటాలను పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సదరం సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోండి

అంబాజీపేట: దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ పొందేందుకు స్లాట్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. ఈ ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి సదరం సర్టిఫికెట్ పొందేందుకు ఈ నెల 4 నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

మలికిపురం: నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి దోషులను శిక్షించాలని, విద్యార్థులకు నష్టపరిహారం ఇవ్వాలని, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రాథమిక పాఠశాలలను ఎత్తి వేయరాదని, ఫీజులు తగ్గించాలని తదితర డిమాండ్లతో జూలై 4వ తేదీన జరిగే దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మలికిపురంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ వివిధ విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది. సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

అంబాజీపేట: మోటారు సైకిల్ మెకానిక్‌ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని పలువురు మెకానిక్‌లు కోరారు. అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్‌లో శ్రీలక్ష్మీ గణపతి మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ మోటారు మెకానిక్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి మెకానిక్‌లకు పంచారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ గాట్లీబ్ డైమ్లర్ 1885లో టూ వీలర్స్‌ను కనిపెట్టారని, ఆయనను స్మరించుకుంటూ ఏటా బైక్ మెకానిక్స్ డేగా జరుపుకుంటున్నామన్నారు. మెకానిక్‌లంతా యూనియన్ బలోపేతానికి కృషి చేసి, ఇతరులకు ఆదర్శంగా నిలుద్దామన్నారు. కార్యక్రమంలో మోటారు మెకానిక్‌లు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా శ్రీరామమూర్తి



అంబాజీపేట: స్థానిక యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్‌గా ఎం.వెంకట శ్రీరామమూర్తి నియమితులయ్యారు. బుధవారం ఆయన ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. అయినవిల్లి మండలం తొత్తరమూడి యూనియన్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తూ అంబాజీపేట యూనియన్ బ్యాంక్‌కు సీనియర్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. ఇంత వరకు ఇక్కడ మేనేజర్‌గా విధులు నిర్వహించిన ఎంవీ రమణ ఉప్పలగుప్తం యూనియన్ బ్యాంకుకు బదిలీపై వెళ్లారు. శ్రీరామమూర్తి మాట్లాడుతూ సిబ్బంది, ఖాతాదారులు, వ్యాపారస్తులు అందరి సహకారంతో బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు.

అతిసార వ్యాధిని అరికడదాం

ఆలమూరు: పారిశుద్ధ్య చర్యలను చేపట్టడం ద్వారా, బలవర్థకమైన పోషకాలు ఆహారంగా తీసుకోవడం ద్వారా ప్రాణాంతకమైన అతిసార (డయేరియా) వ్యాధిని పూర్తిగా అరికట్టి చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షిద్దామని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ అధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్ మల్లికార్జున్, డి.సాయికిషోర్ అన్నారు. రాష్ట్ర కుటుంబ సంక్షేమ ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత నేతృత్వంలో వైద్యారోగ్యశాఖ బుధవారం అతిసారం వ్యతిరేక ద్విమాసోత్సవాలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భారీ ర్యాలీలు నిర్వహించి అతిసారం మహమ్మారిని నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మండలంలోని రెండు పీహెచ్‌సీల పరిధిలోని అన్ని గ్రామాల్లోను అతిసారం నియంత్రణపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆయా పీహెచ్‌సీ ప్రధాన అధికారులు కోరారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జింక్ కార్నర్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఎస్ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ,, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం,శ్రీనివాసరావు, పి.ఉమ, ఆర్ బాలామణి, ల్యాబ్ టెక్నీషియన్ ఆర్ఆర్ రమేష్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.


పెదపళ్లలో అతిసార వ్యాధి నియంత్రణపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

గ్రామాల శుభ్రతతోనే స్వచ్ఛభారత్ సాకారం

ఆలమూరు: పరిశుభ్రమైన ఇల్లుతో పాటు శుభ్రతతో కూడిన పరిసరాలే స్వచ్ఛ భారతానికి ఆభరణాలు అంటూ బుధవారం పినపళ్ళలో ఓఎన్జీసీ స్వచ్ఛ పక్వాడ పక్షోత్సవాలు జరిగాయి. స్థానిక ఓఎన్జీసీ కార్యాలయం సైట్‌లో మేనేజర్ పి.జగన్నాథరావు, సర్పంచ్ సంగిత సుభాష్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ అవగాహన కార్యక్రమం జరిగింది. పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ఓఎన్జీసీ అధికారులు ఏర్పాటు చేసిన బుర్రకథ గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం గ్రామంలో స్వచ్ఛ భారత్ ఆవశ్యకతను వివరిస్తూ ఓఎన్జీసీ అధికారులు, పంచాయతీరాజ్, ఆరోగ్య అంగన్వాడీ సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి, ఉప సర్పంచ్ వై.రాణి, పంచాయతీ కార్యదర్శి ఎస్.వీర్రాజు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


పినపళ్లలోని గ్రామస్తులకు కిట్లు అందజేస్తున్న ఓఎన్జీసీ అధికారులు

లాభసాటి సాగు చేపట్టాలి

వెదజల్లడం, డ్రమ్‌సీడర్‌తో అధిక దిగుబడులు

అంబాజీపేట: వరి సాగు లాభసాటి కావాలంటే ఖర్చులు తప్పని సరిగా తగ్గించుకోవల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రైతన్నలు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా అనేక యాంత్రీకరణ పద్ధతులను అందుబాటులోకి తీసుకువచ్చారు. వెదజల్లు పద్ధతిలో వరి సేద్యం చేస్తే ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకూ ఖర్చు తగ్గుతుంది. వెదజల్లు పద్ధతిలో చేతితో వెదజల్లడం, డ్రమ్ము సీడర్ విధానం అనే రెండు పద్ధతులు ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మూడు నియోజకవర్గాలకు సంబంధించి కొత్తపేటలో 34,702 పి.గన్నవరం 25,382, రాజోలు 8,650 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు.

వెదజల్లు పద్ధతి..

పొలాన్ని 15 రోజుల ముందుగా దమ్ము చేసిన తరువాత విత్తడానికి 4 రోజుల ముందు మరోసారి దమ్ము చేసి సమానంగా చదును చేసి మట్టి పేరుకున్న తర్వాత ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలువ చేయాలి. 8 సాళ్ల పరికరంతో అయితే నీరు నిల్వ ఉండకూడదు. పూర్తిగా తీసివేయాలి. నీరు ఎక్కువైతే బయటకు తీసేందుకు ఏర్పాటు చేయాలి. కాండం గట్టిగా ఉండి పడిపోని వరి రకాలను ఎన్నుకోవాలి.

డ్రమ్ సీడర్‌తో..

డ్రమ్ము సీడర్‌కు నాలుగు ప్లాస్టిక్ డ్రమ్ములుంటాయి. ప్రతి డ్రమ్ముకు 20 సెంటీమీటర్ల ఎడంగా రంధ్రాలుంటాయి. ఈ డ్రమ్ములో మొలకెత్తిన విత్తనాలను నింపి మూత బిగించాలి. గింజలు రాలడానికి వీలుగా డ్రమ్ములోని 3/4 వంతు మాత్రమే విత్తనాలు నింపాలి. ఈ డ్రమ్‌సీడర్ పొలంలో లాగితే 20 సెంటీమీటర్ల ఎడంగా గింజలు పడతాయి. ప్రతి 16 వరుసలకు అడుగు, వెడల్పు కాలిబాటలను ఏర్పాటు చేయాలి. తాడు లాగిన తరువాత డ్రమ్ లాగితే వరుసలు బాగా వస్తాయి.

ఎరువుల యాజమాన్యం..

భాస్వరం, పొటాష్ ఎరువులను మాత్రమే దమ్ములో వేయాలి. నేరుగా విత్తుతాం గనుక కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. అందుకని నత్రజని దమ్ములో వేయకూడదు. భాస్వరం మొత్తం దమ్ములో వేయాలి. పొటాష్‌ను మూడు భాగాలుగా విత్తిన 10–15 రోజులకు, 30–35 రోజులకు, 60–65 రోజులకు వేయాలి. మొక్కల మొదటి ఆకు పూర్తిగా విచ్చుకునే వరకు అంటే 7 నుంచి 10 రోజుల్లో ఆరుతడులు ఇవ్వాలి.


మొసలపల్లిలో డ్రమ్‌సీడర్‌తో వరినాట్లు వేస్తున్న రైతులు (ఫైల్)

కలుపు నివారణ



నేరుగా విత్తిన పొలాల్లో కలుపు బెడద ఎక్కువగా ఉంటాదని వ్యవసాయాధికారులు సూచించిన ఎరువులను వినియోగిస్తే కలుపు నివారణ తగ్గుతుందన్నారు. విచక్షణారహితంగా ఎరువులు, పురుగుల మందుల వాడకాలను తగ్గిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు.

– సీహెచ్‌డీ విజయకుమార్, ఏవో, అంబాజీపేట

ప్లాస్టిక్ భూతంతో మానవాళికి ముప్పు



విశ్వేశ్వరాయపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) మలికిపురం శాఖ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ పాఠశాల కరెస్పాండెంట్, జేవీవీ మండల అధ్యక్షుడు పీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ నేటి కాలంలో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిందని తినటానికి, తాగడానికి, బజారు నుంచి సరుకులు తెచ్చుకోవడానికి ఇలా ప్రతి పనికి ప్లాస్టిక్ బ్యాగులను వినియోగిస్తున్నారన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పారిశుద్ధ్య సమస్యలతో పాటు అనేక రకాల అనారోగ్యాలు కలుగుతున్నాయని అన్నారు. తాగడానికి, తినడానికి స్టీల్ సామాన్లను వాడుకోవాలన్నారు. అలాగే మానవతా మూర్తులు గ్రూప్ అడ్మిన్ బోనం రాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ బహుమతుల స్థానంలో మొక్కలు, క్లాత్ వస్తువులను అందజేయాలని, పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో జంపన బుజ్జిరాజు, మధు రాజు, అటారం మాస్టారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.